# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-05-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1) ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.**

**2) రాష్ట్రంలో రెవెన్యూ సేవలను మరింత సులభతరంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.**

**3) క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

**4) విశ్వకవి, భారత జాతీయ గీతం… "జనగణమన" సృష్టి కర్త రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి ఈరోజు.**

==========================

భారత సాయుధ దళాల పరాక్రమానికి ఆపరేషన్ సిందూర్ ప్రతీకగా నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఏడాది క్రితం ఆపరేషన్ సిందూర్ జరిగిన సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి స్పందిస్తూ..ఈ ఆపరేషన్‌లో సాయుధ దళాలు అసమానమైన ధైర్యసాహసాలను ప్రదర్శించాయని పేర్కొన్నారు. పహల్గామ్‌లో అమాయక భారతీయులపై దాడికి పాల్పడిన వారికి తగిన విధంగా సమాధానం చెప్పాయని అన్నారు. సంవత్సరం తర్వాత కూడా.. ఉగ్రవాదాన్ని ఓడించడానికి, దానికి ఊతమిచ్చే వ్యవస్థను నిర్మూలించడానికి అంతే స్థిరమైన సంకల్పంతో భారత్ ఉందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

--------------------------

ఆర్థిక అసమానతలు లేకుండా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 7వ కలెక్టర్ల సదస్సు ఈరోజు ప్రారంభమైంది. ఈ సమావేశంలో పలు అంశాలపై అధికారులతో చర్చించారు జిల్లాల వారిగా ఆర్థిక వృద్ధి అంచనాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, పెట్టుబడుల కోసం ఉత్తమ విధానాలు తీసుకువచ్చామన్నారు. గ్రీన్ఎనర్జీ, డేటా సెంటర్ పెట్టుబడుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ ఉంటుదని తెలిపారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేలా డిజిటల్ సాంకేతికతను సమర్థంగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి పేర్కొంటూ…

వాయిస్ ..30.. సెకన్లు

---

రాష్ట్రంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సేవలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ప్రజలకు మరింత సులభంగా రెవిన్యూ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నామని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో మంత్రి ఈరోజు పాల్గొని మాట్లాడుతూ, భూ సంబంధిత అంశాల్లో కీలక సంస్కరణలు చేపట్టామని చెప్పారు. అడంగళ్లు, పాస్‌పుస్తకాల జారీ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్ శాఖను ప్రజా హితంగా తీర్చిదిద్దుతున్నామని, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రీసర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే ప్రభుత్వం లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

---

రానున్న గోదావరి పుష్కరాలు నాటికి రాష్ట్రంలోని ఆధ్యాత్మిక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈ రోజు మాట్లాడుతూ, భక్తులకు పుణ్యక్షేత్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జిల్లాలోని నిడదవోలు నియోజకవర్గంలోని పలు దేవాలయాల అభివృద్ధికి పరిపాలనా అనుమతులు, నిధులు మంజూరయ్యాయని చెప్పారు. నిర్ణీత గడువులోపు ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం నాణ్యతతో నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి వివరించారు.

---

క్షేత్రస్థాయిలో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిని ఆసుపత్రిలోని వ్యసన విముక్తి వార్డును మంత్రి నిన్న పరిశీలించి, అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.అనంతరం వైద్య అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 'సంజీవిని' డిజిటల్ ప్లాట్‌ఫారమ్ ద్వారా వ్యక్తిగత ఆరోగ్య రికార్డులను అందుబాటులోకి తెస్తామని, 104 సేవల ద్వారా ఇంటి వద్దకే పలు వైద్య పరీక్షలు అందిస్తామని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పారదర్శకతను, వైద్య సేవలను మెరుగుపరచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి తెలుపుతూ..

వాయిస్ ..30..సెకన్లు

---

ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని భూగర్భ, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా మంత్రి ఈరోజు సమావేశాన్ని నిర్వహించారు. పార్కులు, మురుగునీటి వ్యవస్థ ఆధునీకరణతో పాటు అపరిష్కృతంగా ఉన్న పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడతూ, ప్రజలకు అవసరమైన సదుపాయాలు త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

---

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, మన్యంవీరుడు అల్లూరి సీతారామ రాజు వర్ధంతి ఈరోజు. మన్యం ప్రజల సంక్షేమం కోసం తన ప్రాణాలనే త్యాగం చేసిన పోరాట యోధుడు, సీతారామరాజు. 1897 జూలై 4వ తేదీన నాటి విశాఖజిల్లాలోని పాండ్రంగి గ్రామంలో ఆయన జన్మించారు.స్వాతంత్ర్య ఉద్యమంలో గిరిజనుల హక్కుల కోసం బ్రిటిష్ వారితో గొప్ప పోరాటం చేశారు. 1924 మే 7వ తేదీన బ్రిటీష్ అధికారులు ఎక్కుపెట్టిన తుపాకీకి ఎదురొడ్డి, వందేమాతరాన్ని నినదిస్తూ, అతిచిన్న వయస్సులోనే దేశంకోసం ప్రాణాలను అర్పించిన ఆ మహనీయుని వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అల్లూరి సీతారామ రాజు వర్ధంతి సందర్భంగా గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. అల్లూరి సీతారామ రాజు పోరాటం నేటికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

--------------------------

రైల్ పార్శిల్ యాప్ ద్వారా వినియోగదారులు పార్శిల్ బుకింగ్, ట్రాకింగ్ వంటి సేవలను సులభంగా పొందవచ్చని విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ మోహిత్ సోనాకీయ అన్నారు. విజయవాడలో ఆయన ఈరోజు మాట్లాడుతూ, రైల్ పార్శిల్ యాప్‌ను దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ జోన్ లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని చెప్పారు. విజయవాడ డివిజన్ పరిధిలోని విజయవాడ, రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లలో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైళ్లలో పార్శిళ్లను సులభంగా, ఇంటి వద్ద నుంచే బుక్ చేసుకోవచ్చని, ఈ యాప్‌ను వినియోగదారులు ఉపయోగించుకోవాలని కోరారు.

--------------------------

విశ్వకవి, భారత జాతీయ గీతం “జనగణమన” సృష్టి కర్త, నోబెల్ పురస్కార గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి ఈరోజు. 1861 మే 7వ తేదీన కలకత్తాలో జన్మించిన ఆయన బాల్యంలోనే అనేక పద్యాలు, వ్యాసాలు రాశారు. రవీంద్రనాథ్ రచించిన “గీతాంజలి” కావ్యానికి నోబెల్ పురస్కారం లభించింది. ఆయన రచించిన జనగణమన గీతాన్ని భారత రాజ్యాంగ సభ 1950 జనవరి 24వ తేదీన జాతీయ గీతంగా ఆమోదించింది. విద్య, కళల వికాసానికి కృషి చేసిన రవీంద్రనాథ్ ఠాగూర్ 1941 ఆగస్టు 7వ తేదీన తుదిశ్వాస విడిచారు. రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని పురస్కరించుకుని జనగణమన గీతాన్ని ఆయన గళంలో ఒకేసారి విందాం...

వాయిస్ -- 37 సెకన్లు

=====================